ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం

- సీఎం రేవంత్ రెడ్డివి అన్ని బోగస్ మాటలే..
- రైతులకు బోనస్ ఎందుకు ఇవ్వరు
- ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చరు
- రైతుల రుణ మాఫీ ఏమైంది? రైతు బంధు ఏమైంది?
- రైతుల పాలిట సీఎం శాపంగా మారారు
- అన్ని రకాల వడ్లు కొనాలని శ్రీశైలం హైవేపై ఎమ్మెల్యే సబితారెడ్డి నిరసన

రైతులను నిండా ముంచుతున్న కాంగ్రెస్ పార్టీ

అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని మహేశ్వరం గేట్, శ్రీశైలం హైవేపై నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి బీఆర్ఎస్ నేతలు, రైతులు, రైతు మద్దతుదారులు

బడంగ్‌పేట, మే 16: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలలో రైతులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చకుండా రైతులను నిండా ముంచుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు గురువారం మహేశ్వరం మండల పరిధిలోని శ్రీశైలం హైవేపై రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై రైతులు శాపనార్థాలు పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి తుక్కుగూడ మీటింగ్‌లో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల లిస్టు ఇస్తే 24 గంటలలో ప్రభుత్వం నుంచి సహకారం అందజేస్తామని అన్నారు. ముఖ్య మంత్రి హోదాలో ఉండి బోగస్ మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఆమె విమర్శించారు. ముఖ్యమంత్రి రైతుల పాలిటీ శాపంగా మారిండన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఏ ఒక్కటీ అమలు చేయలేని అసమర్థ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అని ఆమె అన్నారు. రైతులకు రెండు లక్షలు రుణ మాఫీ చేస్తామని, ఇప్పటి వరకు ఎందుకు మాఫీ చేయడం లేదో సీఎం రైతులకు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. రెండు ఎకరాలు, మూడు ఎకరాల ఉన్న వారికి మాత్రమే రైతు బంధు వేస్తామని చెప్పడం, మిగతా వారికి ఇవ్వమనడం లాంటి మాటలు ఎందుకో..? ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. పంటలు పండించిన రైతులు నష్టపోయి ఆత్మహత్యలు చేసుకుంటుంటే సీఎం రాజకీయాలు చేయడం పట్ల ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏ వడ్లకైనా రూ.500లు బోనస్ ఇస్తామని ప్రకటించి, ఎందుకు అమలు చేయడం లేదన్నారు. రైతులు కల్లాలో వడ్లు పోసి కూసుంటే కనీసం పలకరించే వారు లేరన్నారు. ప్రతి గింజకు బోనస్ ఇస్తామని ఊకదంపుడు ఉన్యాసాలు ఇస్తున్నారు.. తప్ప, అమలు చేయడం లేదన్నారు. రైతులను మోసం చేస్తే పుట్టగతులు ఉండవని ఆమె శాపనార్థాలు పెట్టారు. కొనుగోలు కేంద్రాల దగ్గర రైతులు నిరసన తెలుపుతున్నా పట్టించు కోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉలుకూ.. పలుకూ లేదన్నారు. వరంగల్‌లో రైతుల పంటలు ఎండి పోతున్నాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండే ఎండలో కట్టె పట్టుకొని రైతుల దగ్గరకు పోయి వారి కష్టాలు తెలుసుకుంటుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ చూసుకుంటూ ఎంజాయ్ చేశారని ఆమె ఎద్దేవా చేశారు. దీని బట్టి రైతుల పట్ల ముఖ్యమంత్రికి ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. రైతుకు గిట్టుబాటు ధర ఇవ్వడం ఇవ్వకుండా దాటవేత ధోరణి అవలంభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, సొసైటి చైర్మన్ పాండు యాదవ్, చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు అనుమగల్ల చంద్రయ్య, అర్కల కామేష్ రెడ్డి, నాగేష్, వర్కబోర్డు మాజీ చైర్మన్ శంశిద్ దీన్, దీప్ లాల్ చౌహాన్ అబ్జల్, సురేందర్ రెడ్డి, యాదగిరి గౌడ్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

రైతులను మోసం చేసిన ఏ ప్రభుత్వం బాగుపడలేదు

ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ● శామీర్‌పేటలో రైతు మద్దతు ధర్నా

మార్కెట్‌లో వడ్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ నేతలు, రైతు మద్దతుదారులు, రైతులు

శామీర్‌పేట: రైతులను మోసం చేసిన ఏ ప్రభుత్వం బాగుపడలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రైతు మద్దతు ధర్నాను శామీర్‌పేట మండల కేంద్రంలో నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాయమాటలు, మోసపూరిత మాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలం వెల్లదీస్తుందని ఎద్దేవా చేశారు. రైతును మోసం చేసిన ఏ ప్రభుత్వమైనా పుట్టగతుల్లేకుండా పోయిందన్నారు. ముఖ్యమంత్రి 420 హామీలను నెరవేర్చే వర కు రైతులకు, మహిళలకు, ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిలబడుతుందని భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీలేదని విమర్శించారు. నిరంతర విద్యుత్ సరఫరాలోను, ఫర్టిలైజర్స్, సాగునీటిని అందించడంలోనే కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. దీనికి తోడు అకాల వర్షాలు రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని సకాలంలో ధాన్యం కొనుగో లు చేస్తే రైతులకు నష్టాలు వచ్చే పరిస్థితులే ఉండేవి కావన్నారు. ప్రభుత్వం ఇస్తానన్న విధంగా దొడ్డు బియ్యం రైతులకు రూ.500లు వెంటనే బోనస్‌గా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల విషయానికి వస్తే కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. మహిళలకు రూ.2500లు, రూ.4 వేల ఫించన్, రైతు భరోసా ఊసేలేదన్నారు. ఆగస్టు 15 వరకు రుణమాఫీ చేస్తానని ఓట్లు తింటున్న కాంగ్రెస్ పాలకులు ఈ ఆరు గ్యారెంటీల విషయంలో స్పష్టమైన తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పరిపాలన చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతోనే కాలం వెల్లదీస్తున్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సబ్బండ వర్గాలకు సంక్షేమాలు అందిస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలో తీసుకెళ్లారని గుర్తు చేశారు. రైతాంగానికి నాణ్యమైన నిరంతర విద్యుత్, సాగునీరు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడం జరిగిందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వంలో కరెంటు లేదు, సాగునీళ్లు లేవు, ధాన్యం కొనుగోలు లేవు మొత్తం 420 పరిపాలన నడుస్తుందన్నారు. రైతులకు, మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ ఊర్కోదని, ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. డీసీఎంఎస్ వీసీ మధుకర్‌రెడ్డి, తూంకుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, డైరెక్టర్లు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తి చేయాలి

తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలి

జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల డిమాండ్

మేడ్చల్, మే 16(నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా జడ్పీ సర్వసభ్య సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా జడ్పీ సర్వసభ్య సమావేశం గురువారం జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోళ్లను ఆలస్యం చేస్తున్నారని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రజా ప్రతినిధులు అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి సౌకర్యాలు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి జోక్యం చేసుకుని రైతులకు ఇబ్బందుల జరగకుండా తక్షణమే కొనుగోళ్లు చేపట్టాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్‌కు ఆదేశించారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ..

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని డీపీవోను జడ్పీటీసీ, ఎంపీపీ సభ్యులు ప్రశ్నించారు. నిరుపేదలకు సంబంధించిన నిర్మాణాలను కూల్చివేస్తున్నారే తప్ప కొందరి ప్రజాప్రతినిధుల అండ దండలున్న వారి నిర్మాణాలను కూల్చి వేయడం లేదని ఆరోపించారు. దీనిపై స్పందించిన జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి చర్యలు తీసుకునేలా చేద్దామన్నారు.

పంచాయతీ సిబ్బందికి ఆర్నెలల జీతాల్లేవు

ఆరు నెలలుగా గ్రామ పంచాయితీ సిబ్బందికి జీతాలు చెల్లించక పోవడంతో పారిశుధ్యం కొరవడుతుందని సభ్యులు ఆరోపించారు. సిబ్బందికి జీతాలు చెల్లికపోవడంతో గ్రామీణ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. వెంటనే గ్రామ పంచాయితీ సిబ్బందికి జీతాలు చెల్లించాలని జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అధికారులకు ఆదేశించారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్ జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలి

చిక్కడపల్లి, మే 16: రైతులు పండించే అన్ని రకాల వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్ రావు, తీగల సాగర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిందన్నారు. ఇప్పుడు కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. వడ్లు పండించే రైతులలో 80 శాతం దొడ్డు వడ్లు, 20 శాతం సన్న వడ్లను పండిస్తున్నారని వివరించారు. ఇందులో అత్యధికం సన్న చిన్నకారుల రైతులే ఉన్నారని తెలిపారు. బోనస్ చెల్లించని పక్షంలో రైతులను కూడగట్టుకొని పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మైక్రోసాఫ్ట్ ఇండియా (ఆర్ అండ్ డీ) ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో దూలపల్లికి చెందిన సెయింట్ మార్టిన్ విద్యార్థిని పి.శ్రుతికి అరుదైన అవకాశం దక్కింది. ఏడాదికి గాను రూ.52 లక్షల ప్యాకేజీని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గొప్ప అవకాశాన్ని దక్కించుకున్న శ్రుతిని కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, డైరెక్టర్ జి.చంద్రశేఖర్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.సంతోష్ కుమార్ పాత్రలు అభినందించారు. – కుత్బుల్లాపూర్, మే 16

సిబ్బంది, విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

వంద శాతం ఉత్తీర్ణత అభినందనీయం

సీబీఎస్సీ ఫలితాల్లో సీఎంఆర్ విద్యార్థుల ప్రతిభ

జీడిమెట్ల, మే 16: వందశాతం ఉత్తీర్ణత అభినందనీయమని మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు. సూరారం సీఎంఆర్ ఇంటర్ నేషనల్ స్కూల్ విద్యార్థులు పది, 12 తరగతుల్లో ప్రతిభ చూపారు. పాఠశాలలో గురువారం జరిగిన సమావేశంలో మల్లారెడ్డి అతిథిగా పాల్గొని ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందించారు. పదిలో 118 మంది పరీక్ష రాయగా 70 మంది డిస్టింక్షన్ సాధించారు. చెక్రికారెడ్డి, జ్ఞాన సాయిరెడ్డి 96.2 శాతం సాధించారు. 12వ తరగతిలో 41 మంది రాయగా, 33 మంది డిస్టింక్షన్ పొందారు. అనామిక, రాకేష్ గుప్త 97, కరణ్, మణి త్రిపాఠి 91.8, ఇర్ఫాన్ 90, అతిథి, చందనారెడ్డి 84 శాతం మార్కులు సాధించారు. ఉత్తమ పలితాలు సాధించడంలో కృషిచేసిన సిబ్బందిని మల్లారెడ్డి అభినందించారు.

బాలిక కడుపులో నుంచి 3.7 కేజీల కణితి తొలగింపు

బేగంపేట, మే 16: 14 ఏళ్ల బాలిక కడుపులో కుడివైపు మూత్ర పిండానికి అతుక్కుని ఉన్న 3.7 కేజీల కణితిని కిమ్స్ కడల్స్ వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించి విజయవంతంగా తొలగించారు. ఈ శస్త్ర చికిత్సలో బాలిక కుడివైపు మూత్రపిండాన్ని కూడా తొలగించారు. ఆఫ్రికాలోని సొమాలియాకు చెందిన 14 ళ్ల బాలిక తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్న పరిస్థితుల్లో అక్కడ సీటీ స్కాన్ నిర్వహించిన తరువాత, అక్కడ వైద్యం అందుబాటులో లేకపోవడంతో భారత్‌కు వెళ్లాలన్న అక్కడి వైద్యుల సూచన మేరకు బాలిక కుటుంబ సభ్యులు సికింద్రాబాద్ కిమ్స్‌కు వచ్చారు. ఇక్కడ చీఫ్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ లాప్రోస్కోపిక్ సర్జన్, పీడియాట్రిక్ యూరాలజిస్ట్ డాక్టర్ యోగానంద్, డాక్టర్ అవినాష్‌ల నేతృత్వంలో వైద్యులు శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించి, ఉదర భాగం మొత్తం వ్యాపించి, కుడి వైపు మూత్రపిండానికి అతుక్కుని ఉన్న 3.7 కేజీల కణితిని తొలించారు. తొలగించిన కణితిని బయోప్సీకి పంపి పరీక్షలు చేయించగా, అది సాధారణ కణితిగా తేలిందని వైద్యులు వివరించడంతో క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన కిమ్స్ కడల్స్ వైద్యులకు బాలిక కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

సకల వసతులతో పాఠశాలలు సిద్ధం కావాలి: కలెక్టర్

సిటీబ్యూరో, మే 16(నమస్తే తెలంగాణ): పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు అన్నీ వసతులు సమకూర్చేలా అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం దృష్ట్యా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ జిల్లాలో 440 ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, బెంచీలు, గ్రీన్ చాక్ బోర్డు, ఎలక్ట్రిసిటీ, టాయిలెట్స్ ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, టీఎస్ ఈడబ్ల్యూడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షఫీ మియా, జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కో ఆర్డినేటర్ రజిత పాల్గొన్నారు.

నీటి నిల్వలు తగ్గితే రెండో దశ పంపింగ్

- గతేడాది కంటే అదనంగా 20 ఎంజీడీల నీరందిస్తున్నాం
- ఈ ఏడాది రికార్డు స్థాయిలో రోజూ 580 ఎంజీడీల నీరు
- సెప్టెంబర్ కల్లా సుంకిశాల ప్రాజెక్టును అందుబాటులోకి తెస్తాం
- ఎమర్జెన్సీ పంపింగ్ ప్రక్రియను పరిశీలించిన ఎండీ సుదర్శన్ రెడ్డి

సిటీబ్యూరో, మే 16(నమస్తే తెలంగాణ): నాగార్జున సాగర్ జలాశయం నుంచి ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నగరానికి నీటి సరఫరా ప్రక్రియ సజావుగా సాగుతుందని, రాబోయే రోజుల్లో మరింత నీటి నిల్వలు తగ్గితే రెండో దశ పంపింగ్ చేపట్టి నీటి ఎద్దడి లేకుండా చేస్తామని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నీటి సబ్ మెర్సిబుల్ పంపులను ఏర్పాటు చేసి నీటి సరఫరాకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉన్నతాధికారులతో కలిసి ఎండీ ఎమర్జెన్సీ పంపింగ్ పనులను పరిశీలించారు. జలమండలి పరిధి ఓఆర్ఆర్ వరకు విస్తరించడంతో తాగునీటి సరఫరా కూడా పెరిగిందని చెప్పారు. హైదరాబాద్ మహానగరానికి ఈ వేసవిలో 580 ఎంజీడీల నీటి సరఫరా చేశామని, ఇప్పటి వరకు ఇదే అత్యధిక సరఫరా అని ఎండీ తెలిపారు. వివిధ సోర్స్‌ల నుంచి గతేడాది కంటే 20 ఎంజీడీలు అదనపు నీటిని నగర వాసులకు అందించామన్నారు. అనంతరం ఎండీ సుదర్శన్‌రెడ్డి సుంకిశాల ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు పురోగతిని అధికారుల్ని ఆడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పైపులైన్ పనులను ఎండీ పరిశీలించారు. ప్రస్తుతం సివిల్, టన్నెల్, ఎలక్ట్రికల్, పైపులైన్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వీటిలో టన్నెల్, ఎలక్ట్రికల్ పనులు తుది దశకు చేరుకున్నాయని, సివిల్ వర్క్స్ కొనసాగుతున్నాయని ఎండీ వివరించారు. ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసి ఈ సెప్టెంబరు వరకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎండీ అధికారులకు సూచించారు. సాధారణంగా నాగార్జున సాగర్ రిజర్వాయర్‌లో డెడ్‌స్టోరేజీలో 25.941 టీఎంసీలు, 510 అడుగుల నీరు ఉన్నంత వరకు వాడుకునే వెసులుబాటు ఉంటుంది. వేసవిలోనూ తాగునీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు కేసీఆర్ ప్రభుత్వం సుంకిశాల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. నాగార్జున సాగర్‌లో జలాలు డెడ్ స్టోరేజికి పడిపోయినా ఈ ప్రాజెక్టు ద్వారా నగరానికి తాగునీరు అందించవచ్చు. కార్యక్రమంలో డైరెక్టర్లు రవి కుమార్, సుదర్శన్, సీజీఎం దశరథ్ రెడ్డి, జీఎం శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ స్పందన అభినందనీయం

తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి కొండూరి గంగాధర్

సుల్తాన్‌బజార్, మే 16: ఉద్యోగుల న్యాయమైన, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం అభినందనీయమని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సం ఘం ప్రధాన కార్యదర్శి కొండూరి గంగాధర్ అన్నారు. ఈ మేరకు గురువారం నాంపల్లిలోని నాల్గవ తరగతి కేంద్ర సంఘం భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవ ంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగుల అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ చెందిన సుమారు వంద మంది ఆంధ్రాలో విధు లు నిర్వహిస్తున్నారని వారిని స్వరాష్ట్రానికి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.ఉద్యోగుల పెండింగ్‌లో ఉన్న డీఏలను త్వరితగతిన మంజూరు చేయాలని అన్నారు.సీనియారిటి,పాలన అనుభవం వంటి అంశా లను పరిగణలోకి తీసుకోని పదోన్నతులు కల్పించాలని అన్నారు.అంతే కాకుండా ప్రభుత్వ శాఖలలో ఖా ళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్,గౌరవ అధ్యక్షుడు ఖాదర్‌బిన్ హసన్,నాల్గవ తరగతి నగర శాఖ అధ్యక్షుడు లక్ష్మణ్,కార్యదర్శి జి శ్రీనివాస్,జిల్లా శాఖ అధ్యక్షుడు సత్యనారాయణ,కార్యదర్శి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి కొండూరి గంగాధర్

ముందు బీసీల లెక్కలు తేల్చండి

ఆ తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించండి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

ఖైరతాబాద్, మే 16: బీసీల లెక్కలు తేల్చిన తర్వాతే.., స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోందని, కులగణన, రిజర్వేషన్లను పెంచకుండా ఆ నిర్ణయం తీసుకోవద్దన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో సమగ్ర కులగణన చేపడుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నం.26ను విడుదల చేయడంతో పాటు రూ.150 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రస్తు తం, ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ఎన్నికలకు ముందు జారీ చేసిన జీవో నం.26 ప్రకారం, తక్షణమే కులగణన షురూ చేయాలన్నారు. ఆ తర్వాతే గ్రామ పంచాయతీ, మండల, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే బీసీలు ఆర్థికంగా బలంగా లేరన్న సాకుతో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో టికెట్లు ఇవ్వలేదని, రిజర్వేషన్లు పెంచకుండానే ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు తీరని నష్టం జరుగుతుందని, న్యాయపరమైన చిక్కులు ఏర్పడి శాశ్వతంగా దానికి బ్రేకులు పడే ప్రమాదం ఉందన్నారు. ఒకటి, రెండు నెలల్లోనే శాస్త్రీయంగా బీసీల లెక్కలు తీసే అవకాశం ఉందని, ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు స్థానిక సంస్థల ఊసెత్తవద్దన్నారు. త్వరలోనే కులగణన, రిజర్వేషన్ల పెంపు, స్థానిక సంస్థల ఎన్నికలపై మేధావులు, రిజర్వేషన్ల నిపుణులతో మేధోమథన సమావేశాన్ని ఏర్పాటు చేసి స్పష్టమైన విధానాన్ని ప్రకటిస్తామన్నారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, మహి ళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.మణి మంజరి, జన సైన్యం అధ్యక్షులు నగేష్, సత్యం యాదవ్ పాల్గొన్నారు.

'తెలుగు ప్రముఖుల అభిమానిగా..' కవితా సంపుటి ఆవిష్కరణ

మద్దాలి ఉషా గాయత్రికి కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం అందిన సందర్భంగా ఆత్మీయ సత్కారం, కిన్నెర రఘురాం రచించిన 'తెలుగు ప్రముఖుల అభిమానిగా.. ' కవితా సంపుటి ఆవిష్కరణ గురువారం రవీంద్రభారతిలో జరిగింది. ఇందుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి ముఖ్య అతిథిగా వచ్చారు. జ్యోతిని వెలిగించి పుస్తకాన్ని ఆవిష్కరించారు. మద్దాలి ఉషా గాయత్రి గొప్ప సాహిత్య కళాకారిణి, కేంద్ర సంగీత అవార్డు రావడం ఎంతో అభినందనీయమన్నారు. – రవీంద్రభారతి